క్లుప్తంగా

వివాహిత అదృశ్యం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వివాహిత అదృశ్యమైన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసుల కథనం మేరకు.. కామాటి వీధిలో నివాసం ఉంటున్న మునిప్రసాద్, శివకుమారి దంపతులకు ఇద్దరు కుమారులు. చెన్నైలోని బంగారు దుకాణంలో మునికుమార్ పనిచేస్తారు. ఈ క్రమంలో గత నెల ఐదున చెన్నైకి వెళ్లిన ఆయన తన భార్యకు ఫోన్ చేశారు. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో తిరిగి నెల్లూరొచ్చారు. కుమారులు సంతోష్‌కుమార్, శివప్రసాద్‌ను ఆరా తీయగా, ఉదయం పది నుంచి కనిపించ లేదని చెప్పారు. దీంతో గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ప్రయోజనం లేక పోవడంతో చిన్నబజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కామాక్షితాయి సేవలో..



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారిని బెంగళూరు ఐజీపీ చంద్రశేఖర్ తన కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. తొలుత ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వారిని శేషవస్త్రాలతో సత్కరించారు. ఆలయ చైర్మన్ సుబ్రహ్మణ్యంనాయుడు, ఎస్సై వీర ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు



బుచ్చిరెడ్డిపాళెం: స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్యశాఖ డెమో అధికారి శ్రీనివాసరావు హెచ్చరించారు. బుచ్చిరెడ్డిపాళెంలోని దేవి నర్సింగ్ హోమ్, కేఎమ్, స్వస్తిక్ ఆస్పత్రుల్లోని స్కానింగ్ సెంటర్లను మంగళవారం తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. డీఎంహెచ్‌ఓ పెంచలయ్య ఆదేశాల మేరకు తనిఖీ చేశామని తెలిపారు. ఐఈసీని ప్రదర్శించారా నసే అంశాన్ని పరిశీలించారు. హెచ్‌ఈఈఓ నరసింహారావు, హెల్త్ ఎడ్యుకేటర్ సునీత, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంతో చదివితే మంచి ఫలితాలు



మనుబోలు : విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే మంచి ఫలితాలు సాధించ వచ్చని నెడ్ క్యాప్ డైరెక్టర్ భాస్కర్‌గౌడ్ అన్నారు. మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థుల ఉత్తీర్ణత శాతం ఎలా పెంచాలి అనే అంశంపై మంగళవారం పురోగాణి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు విద్యార్థులు, తల్లిదండ్రులకు పలు సూచనలు, సలహాలు చేశారు. విద్యార్థులపై ఒత్తిడి పెంచడం మంచిది కాదన్నారు. విద్యార్థులకు మంచి పోషక విలువలున్న ఆహారం, సరిపడినంత నిద్ర ఉండాలన్నారు. కేవలం ఉపాధ్యాయులపైనే ఆధార పడకుండా ఇళ్లల్లో కూడా విద్యార్థులకు సమయం కేటాయించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం డేవిడ్, జెడ్పీటీసీ సభ్యుడు చిట్టమూరు అనితమ్మ, వైఎస్సార్‌సీపీ నేతలు హరగోపాల్‌రెడ్డి, అజయ్‌కుమార్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు



కోవూరు: సబ్ డివిజన్ పరిధిలో నేరాల నియంత్రణకు పోలీస్ సిబ్బంది పటిష్ట చర్యలు చేపట్టారని రూరల్ డీఎస్పీ ఆంజనేయరెడ్డి పేర్కొన్నారు. కోవూరు సీఐ కార్యాలయాన్ని మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. నేరాల నియంత్రణకు గానూ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని వివరించారు. ఎలాంటి ఆధారం లేని చోరీ కేసులను కోవూరు సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఛేదించడాన్ని అభినందించారు. అనంతరం చెర్లోపాళెంలో ఎస్సీ, ఎస్టీ కేసుకు సంబంధించిన విచారణను చేపట్టారు. తొలుత రికార్డులను పరిశీలించారు.

సచివాలయాల ద్వారా మెరుగైన సేవలందించాలి

• కలెక్టర్ చక్రధర్‌బాబు



మాట్లాడుతున్న చక్రధర్‌బాబు

నెల్లూరు(అర్బన్): సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలను అందించాలని కలెక్టర్ చక్రధర్‌బాబు పేర్కొన్నారు. వెంకటేశ్వరపురంలోని భగత్‌సింగ్ కాలనీలో గల 54 / 4, జనార్దన్‌రెడ్డి కాలనీలోని 54 / 3 సచివాలయాల్లో ఆకస్మిక తనిఖీలను కమిషనర్ హరితతో కలిసి కలెక్టర్ మంగళవారం చేపట్టారు. ప్రజా సమస్యలపై రోజూ ఎన్ని అర్జీలు వస్తున్నాయి.. ఎన్నింటిని పరిష్కరించారు.. ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయనే అంశాలను ఆరాతీసిన అనంతరం ఆయన మాట్లాడారు. సచివాలయాల్లో అందిస్తున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సచివాలయాల పరిధిలో ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధాన ప్రక్రియను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని చెప్పారు. ఈ – శ్రమ్, ఆయుష్మాన్ భారత్ లక్ష్యాలను నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని పేర్కొన్నారు. సేవల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి చేయాలన్నారు. సచివాలయాల పరిధిలో ప్రాథమిక ఆరోగ్య సేవలు సకాలంలో అందేలా కృషి చేయాలని హెల్త్ అసిస్టెంట్లను ఆదేశించారు. అర్బన్ తహసీల్దార్ నిర్మలానందబాబా, తదితరులు పాల్గొన్నారు.

లీజు హక్కులకు వేలం



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో 2023 – 24 సంవత్సరానికి సంబంధించిన వివిధ హక్కులను లీజుకు ఇచ్చేందుకు గానూ బహిరంగ వేలాన్ని మంగళవారం నిర్వహించారు. దేవస్థాన ఈఓ గిరికృష్ణ, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్ పర్యవేక్షణలో కార్యక్రమాన్ని జరిపారు. కొబ్బరికాయలు, పూజా ద్రవ్యాల విక్రయానికి రూ.19.09 లక్షలు, తూర్పు గాలిగోపురానికి దక్షిణం వైపున పుష్పాలను విక్రయించుకునేందుకు రూ.8.62 లక్షలు, ఉత్తరం వైపున విక్రయానికి రూ.6.8 లక్షలు, భక్తి పుస్తకాలు, సీడీలు విక్రయించుకునేందుకు రూ.82,500, పాదరక్షలను భద్రపర్చే హక్కును రూ.1.05 లక్షలను దక్కించుకున్నారు. పర్యవేక్షణాధికారిగా దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుధీర్ వ్యవహరించారు. దేవస్థాన ఆహ్వాన కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులతో సీపీఐ నేతల సమావేశం



మాట్లాడుతున్న అంకయ్య

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 54వ డివిజన్లో గల జనార్దన్‌రెడ్డికాలనీలో నిర్మించిన టిడ్కో గృహాల వద్ద లబ్ధిదారులతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని సీపీఐ నేతలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి అంకయ్య మాట్లాడారు. టిడ్కో గృహాలు, జగనన్న కాలనీల్లో సమస్యలను పరిష్కరించాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సిరాజ్, షానవాజ్, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా, సర్దార్, మధు, బాదుల్లా, అల్తాఫ్, సుల్తాన్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత అజీజ్ దిష్టిబొమ్మ దహనం



నెల్లూరు(వేదాయపాళెం): ఎస్పీ విజయారావుపై టీడీపీ నేత అబ్దుల్ అజీజ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బయ్య ఖండించారు. అజీజ్ దిష్టిబొమ్మను వీఆర్సీ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం దహనం చేశారు. ఈ సందర్భంగా సుబ్బయ్య మాట్లాడారు. మాదిగలకు వ్యతిరేకంగా పనిచేసిన టీడీపీకి తగిన గుణపాఠం చెప్పామని, ఆ పార్టీ నేతలు ఇదే తరహాలో ప్రవర్తిస్తే పార్టీకి భవిష్యత్తు ఉండదని హెచ్చరించారు. ఎస్పీకి అజీజ్ క్షమాపణలు చెప్పాకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని చెప్పారు. మన ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు శ్రీనివాసులు, సునీత, నేతలు వెంకట్రావు, చిన్నయ్య, రఘురామయ్య, తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలను అరికట్టాలి



మాట్లాడుతున్న పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): జిల్లాలో మాతాశిశు మరణాలు జరగకుండా వైద్యులు తగు చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో జిల్లాలో సంభవించిన ఒక మాతృమరణం, 10 శిశు మరణాలపై సబ్ కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీపీ లాంటి హైరిస్క్ కేసులు.. తీవ్ర రక్తహీనత ఉన్న వారిలోనే ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని చెప్పారు. గర్భిణులు తమ పేరును నమోదు చేయించుకున్నప్పటి నుంచి ఆరోగ్య కార్యకర్తలు సమయానుకూలంగా టీకాలు వేయడం, ఐసీడీఎస్ ద్వారా పౌష్టికాహారాన్ని అందించేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. గర్భిణులకు అవసరమైన ఫోలిక్ యాసిడ్, ఇతర విటమిన్ మాత్రలను అందించాలని కోరారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి గైనకాలజీ హెచ్‌ఓడీ గీతాలక్ష్మి, జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ రామచంద్ర, అనస్థీషియా డాక్టర్ శ్రీనివాసరావు, డెమో అధికారి శ్రీనివాసరావు, డీపీహెచ్ఎన్ భూలోకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎంజీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని సరస్వతీనగర్ ఫీడర్‌లో గల పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా బుధవారం ఉండదని నెల్లూరు వెస్ట్ – 1 ఏఈ లక్ష్మీబాయి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సరస్వతీనగర్, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

కబడ్డీ పోటీల బ్రోచర్ల ఆవిష్కరణ



నెల్లూరు(బారకాసు): బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో మోదీ కబడ్డీ పోటీలను నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో త్వరలో నిర్వహించనున్నామని జిల్లా అధ్యక్షుడు యశ్వంత్‌సింగ్ పేర్కొన్నారు. పోటీలకు సంబంధించిన బ్రోచర్లను పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్‌యాదవ్, తదితరులు మంగళవారం ఆవిష్కరించారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నేతలు రఘురామ్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, విజయలక్ష్మి, అశోక్, విష్ణుతేజ, చంద్ర, ప్రవీణ్, శివ, కిరణ్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



నెల్లూరు(బారకాసు): జర్నలిస్టులు, వారి కుటుంబసభ్యుల కోసం ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో దీక్ష హస్పిటల్, హరిత న్యూరోకేర్ సహకారంతో కార్యక్రమాన్ని చేపట్టారు. ఆర్థోపెడిక్ అన్వేష్, గర్భకోశ వ్యాధుల వైద్య నిపుణురాలు హారిక, యూరాలజిస్ట్ గోకుల్ నచికేత్, న్యూరాలజిస్ట్ హరితకుమారి హాజరై వైద్యసేవలను అందించారు. అనంతరం మందులను పంపిణీ చేశారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వరిసాగులో ఎలుకల నివారణ కీలకం



బుచ్చిరెడ్డిపాళెం: వరిసాగులో ఎలుకల నివారణ కీలకమని వ్యవసాయ విస్తరణాధికారి అనిత పేర్కొన్నారు. ఎలుకల నివారణపై రేబాలలోని సచివాలయం వద్ద రైతులకు మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎలుకలను నివారించకపోతే ధాన్యం దిగుబడి తగ్గుతుందని తెలిపారు. రైతులకు మందులను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తోందని పేర్కొన్నారు. తిరుపతికి చెందిన వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు అవగాహన కల్పించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ సతీష్‌రెడ్డి, మస్తానయ్య, తదితరులు పాల్గొన్నారు.

సినిమాలకు హబ్‌గా సింహపురి



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న కృష్ణారెడ్డి, తదితరులు

నెల్లూరు(బృందావనం): ఇటీవలి కాలంలో సినిమాలకు హబ్‌గా నెల్లూరు మారిందని 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. నగరానికి చెందిన చంటి దర్శకత్వం వహించిన లైబ్రరీ సినిమాకు సంబంధించిన ట్రైలర్, టీజర్, ఆడియో రిలీజ్ ఫంక్షన్ల బ్రోచర్లను అమరావతి చాంబర్స్‌లో మంగళవారం ఆవిష్కరించిన అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడారు. వీఆర్సీ మైదానంలో కార్యక్రమాన్ని ఫిబ్రవరి ఐదో తేదీన నిర్వహించనున్నారని చెప్పారు. ఉచిత పాసులు కావాల్సిన వారు 95506 76365 నంబర్‌ను సంప్రదించాలని చంటి కోరారు. కళాసంఘాల కన్వీనర్లు హరిబాబు, హరనాథ్‌రెడ్డి, అమీర్‌జాన్, భాస్కర్, డ్యాన్స్ మాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, నటుడు నవీన్, తదితరులు పాల్గొన్నారు.

మన్సూర్‌నగర్‌లో వైద్య శిబిరం



నెల్లూరు(బృందావనం): మన్సూర్‌నగర్‌లోని హాజీరా హాస్పిటల్లో ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు షహబుద్దీన్, జమాతే ఇస్లామీ హింద్ నగర శాఖ అధ్యక్షుడు అన్వర్‌బేగ్ మాట్లాడారు. 75 మందికి నేత్ర, 150 మందికి దంత పరీక్షలను నిర్వహించామని వివరించారు. కొండారెడ్డి దంత వైద్యశాలకు చెందిన వైద్యులు దివ్యారెడ్డి, స్మార్ట్ విజన్ హాస్పిటల్ వైద్యుడు రాజేంద్రరెడ్డి ఆధ్వర్యంలో పరీక్షలు చేశారు. ఖయ్యూం, మైనుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అల్పాహారం అందజేత



నెల్లూరు(అర్బన్): నవాబుపేటలోని చిన్నబాలయ్య నగర్‌లో పేదలకు అల్పాహారం, పండ్లను మంగళవారం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే శ్రీధరకృష్ణారెడ్డి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని విశ్వమాత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. ఫౌండేషన్ సభ్యులు రాధమ్మ, భరత్, కిశోర్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో విశేష పూజలు



నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థానంలో స్వామివారి 37వ వార్షిక ప్రతిష్ఠ దినోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. అయ్యప్పస్వామికి క్షీరాభిషేకం, గణపతిహోమం, నవకలశాభిషేకం, పుష్పాభిషేకం, శీవేలి ఉత్సవాన్ని కేరళకు చెందిన ఆలయ తంత్రి నారాయణ నంబూద్రి, మేల్‌శాంతి రామన్ తిరుమేని, నారాయణభట్టు, సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిపారు. ఉభయకర్తలుగా మల్లికార్జునరెడ్డి, చంద్రప్రభ దంపతులు, శ్రీకాంత్, రంగరాజు వ్యవహరించారు. అయ్యప్ప సేవా సమాజ అధ్యక్ష, కార్యదర్శులు శేషగిరిరావు, వెంకటరత్నం, కోశాధికారి రత్నయ్య, మోహన్‌రావు, మురళీకృష్ణారెడ్డి, తదితరులు పర్యవేక్షించారు.

‘డీకేడబ్ల్యూ’లో ఎండోమెంట్ లెక్చర్



మాట్లాడుతున్న శ్రీకాంత్

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఎండోమెంట్ లెక్చర్‌ను ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. లలిత జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన నిధితో ఎండోమెంట్ లెక్చర్ కార్యక్రమాన్ని ఆమె భర్త అభ్యర్థన మేరకు ఏటా నిర్వహిస్తున్నారు. రిసోర్స్ పర్సన్‌గా ప్రముఖ కవి శ్రీకాంత్ వ్యవహరించారు. ఇంగ్లిష్‌ను ఎలాంటి తప్పులతో మాట్లాడతారో ఉదాహరణలతో వివరించారు. ప్రిన్సిపల్ గిరి, వైస్ ప్రిన్సిపల్ రమణరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ప్రసాద్, అధ్యాపకులు కృష్ణమూర్తి, ఉమామహేశ్వరి, వెంకటేశ్వర్లు, వింధ్యావళి, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలి



నెల్లూరు(సెంట్రల్): వ్యవసాయంలో రోజురోజుకూ మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంపై రైతులు అవగాహన పెంచుకోవాలని కృషి విజ్ఞాన కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త లీలాజ్యోతి పేర్కొన్నారు. దళిత, గిరిజన ఉప ప్రణాళికపై శిక్షణ కార్యక్రమాన్ని బీవీనగర్‌లోని కేవీకేలో బెంగళూరుకు చెందిన భారతీయ పరిశోధన ఉద్యాన సంస్థ, కృషి విజ్ఞాన కేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఉప ప్రణాళికలో భాగంగా అందిస్తున్న ఇన్‌పుట్ సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేవీకే ద్వారా రైతులకు వివిధ రకాల పంటల సాగుపై ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలను ఇస్తున్నామని వివరించారు. ఉప ప్రణాళికలో భాగంగా ఎస్సీ, ఎస్టీ రైతులకు మామిడి, జామ, డ్రాగన్ ఫ్రూట్స్, రోజా మొక్కల విత్తనాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ టీహెచ్ సింగ్, డాక్టర్ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర ఎలా చేయాలో జగన్‌ను చూసి నేర్చుకోండి

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్



సంక్షేమ పథకాలపై కరపత్రాన్ని అందజేస్తున్న అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): పాదయాత్ర ఎలా చేయాలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని చూసి నేర్చుకోవాలని నారా లోకేశ్‌కు నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ హితవు పలికారు. నగరంలోని 15వ డివిజన్లో గల బాలాజీనగర్ మసీదు సెంటర్, తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం ఆయన నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాదయాత్రలో జనాలు కనిపించడంలేదని చెప్పారు. నాలుగు వేల కిలోమీటర్ల మేర పాదయాత్ర చేస్తానని ప్రగల్భాలు పలికారని.. పులిని చూసి నక్క వాతలు పెట్టుకుందనే సామెత లోకేశ్‌కు సరిపోతుందని విమర్శించారు. పాదయాత్రలో లోకేశ్ తన హాస్య విన్యాసాలతో కామెడీ షోను తలపిస్తున్నారని ఎద్దేవా చేశారు. తన పాదయాత్రతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆందోళనకు గురవుతోందని ఆయన చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఎప్పుడే పార్టీలో ఉంటారో తెలియని ఆనం రామనారాయణరెడ్డి తనది సుదీర్ఘ రాజకీయ చరిత్ర అని చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. 2019లో జగన్‌మోహన్‌రెడ్డి భిక్షతో ఎమ్మెల్యేగా గెలుపొందారని, టికెట్ ఇవ్వకపోయుంటే రాజకీయ జీవితం సమాప్తమై ఉండేదని గుర్తుచేశారు. అధికారం ఎక్కడుంటే అక్కడికి వెళ్లడం.. అధికారులను విమర్శించడం తగదని హితవు పలికారు. ఇదేనా ఆయన పెద్దరికమని ప్రశ్నించారు. కార్పొరేటర్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.